# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 201, | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజిలు : 8, | వెల రూ. 2 | ఆదివారం -25 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




2లో

## స్థానిక ఎన్నికలపై జగన్ ది 'హిట్ అండ్ రన్' ధోరణి: సీఎం చంద్రబాబు

- వైసీపీ హయాంలో జరిగిన ఘటనలపై 'అదే హింస.. అవే అబద్ధాలు' పేరుతో బుక్‌లెట్ విడుదల
- గత ఐదేళ్లలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని చంద్రబాబు ఆరోపణ
- ప్రజల నమ్మకంతో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని వెల్లడి
- కోల్పోయిన బ్రాండ్ ఏపీని పునరుద్ధరించి, పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని స్పష్టీకరణ

# గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ, నైతిక, కుటుంబ విలువలు లేవు

### స్థానిక ఎన్నికల వేళ హింసను ప్రేరేపిస్తూ రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

- ★ మేనకోడలు వివాహానికి యలహంక ప్యాలెస్ ఇవ్వనని చెబుతున్నాడు.. ఇదేం చోద్యం!: సీఎం చంద్రబాబు
- ★ మేనకోడలి వివాహానికి ప్యాలెస్ ఇవ్వకుండా కంస మామలా మారారని సీఎం విమర్శ
- ★ బాబాయిని చంపిన నిందితులను కాపాడిన వ్యక్తి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటమా అని ప్రశ్న
- ★ ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి ప్రమాదకరం అని ప్రజలు గ్రహించాలని సూచన



అమరావతి: గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ విలువలే కాదు, కనీస కుటుంబ, నైతిక విలువలు కూడా లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. సొంత మేనకోడలి వివాహ వేడుకకు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ ఇచ్చేందుకు నిరాకరించడం ఎంతవరకు సబబని, ఇదేం చోద్యమని ప్రశ్నించారు. ఆస్తిలో చెల్లెలికి భాగం ఉన్నప్పటికీ, మేనకోడలి పెళ్లిని అడ్డుకుని 'కంస మామ'గా తయారయ్యారని విమర్శించారు. ఆస్తుల కోసం కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా వేధిస్తున్నారని, మిగతా 2 లో

## పీసుమామిడి పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి.. సమగ్ర విచారణకు డిమాండ్



2లో

### అల్లూరి జిల్లాలో రోడ్డు పనుల వద్ద భారీ పేలుడు

### జిలెటిన్ స్టిక్స్ పేలి ఏడుగురి మృతి

### అత్యంత బాధాకరమన్న జగన్

అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పీసుమామిడి ఘాట్ రోడ్డులో నిర్మాణ పనుల్లో భాగంగా జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో, విధి నిర్వహణకు వెళుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఒక బొలెరో, ఒక టిప్పర్ వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... రోడ్డు విస్తరణ పనుల కోసం

## పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు..



2లో

### మరింత బలపడుతున్న ఎల్‌నినో!

- అక్టోబర్ 22న నమోదైన చారిత్రక ఉష్ణోగ్రత
- ఎల్‌నినో మరింత బలపడుతోందని డబ్ల్యూఎంఓ అంచనా
- డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం
- 2026 నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం



2లో

### ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న 'ఆర్నాబ్' తుపాను..

## 27, 28 తేదీల్లో కుంభవృష్టి!

- బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం
- 27, 28 తేదీల్లో తీరం దాటే అవకాశం
- ఉత్తర కోస్తా జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు!
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన



2లో

## ఏపీ పరిషత్ పోరుకు పోటెత్తిన నామినేషన్లు.. నువ్వా నేనా అంటున్న టీడీపీ, వైసీపీ

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీగా దాఖలైన నామినేషన్లు
- ఎంపీటీసీలకు 51,902, జెడ్పీటీసీలకు 5,724 నామినేషన్లు
- నామినేషన్ల దాఖలులో టీడీపీ, వైసీపీ మధ్య తీవ్ర పోటీ
- ప్రభుత్వంపై జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్న కూటమి

### విమానాశ్రయాల్లో వ్యాట్ 29 శాతం నుంచి

# ఒక శాతానికి తగ్గింపు

- నవంబర్ 1 నుంచి 2027 అక్టోబర్ 31 వరకు రాయితీ అమలు
- సీఎం విజయ్ కీలక నిర్ణయం.. ప్రశంసించిన కేంద్రం!
- తమిళనాడు సీఎం విజయ్ ప్రభుత్వానికి కేంద్ర మంత్రి ప్రశంసలు
- చెన్నై విమానాశ్రయంలో ఏటీఎఫ్ వ్యాట్ 29 నుంచి 16 శాతానికి తగ్గింపు
- నిర్ణయాన్ని స్వాగతించిన ఇండిగో విమానయాన సంస్థ
- విమాన కనెక్టివిటీ, పర్యాటక రంగానికి ప్రయోజనం చేకూరే అవకాశం





అమరావతి: తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న మిగతా 2 లో

### టెక్నాలజీ అద్భుతం.. స్వామి చిన్మయానంద

## ఏఐ రూపంతో ప్రధాని మోదీ సంభాషణ

### ఆధ్యాత్మిక వారసత్వానికి ఆధునిక టెక్నాలజీని జోడించిన అరుదైన ఘట్టం

- చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించిన ప్రధాని
- దివంగత స్వామి చిన్మయానంద ఏఐ హోలోగ్రామ్‌తో మాట్లాడిన మోదీ
- 1993 నాటి సమావేశాన్ని గుర్తుచేసుకున్న స్వామీజీ డిజిటల్ అవతార్
- ఇది 33 ఏళ్ల వెనక్కి వెళ్లినట్టుందని ప్రధాని మోదీ భావోద్వేగం



ఢిల్లీ: ఆధ్యాత్మికత, ఆధునిక సాంకేతికత కలిసిన ఓ అరుదైన ఘట్టం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆవిష్కృతమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో రూపొందించిన దివంగత ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానంద మిగతా 2 లో



2లో

## కరోనా సమయంలో కేసీఆర్ మాటలు నమ్మి జనం శ్మశానాలకు చేరారు: సీఎం రేవంత్ రెడ్డి

- ఆయనో సైంటిస్టులా భావించుకుని బాధ్యతారహితంగా మాట్లాడారని తీవ్ర విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం కరవు సృష్టించిందన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై మండిపాటు
- విపత్తులపై ప్రజలను హెచ్చరించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ

### క్షుద్రపూజలు చేసేవాళ్లు

# నీతులు చెబుతున్నారు

### కేసీఆర్ కుటుంబం ఏ వ్యాపారాన్నీ వదల్లేదని ఆరోపణ

- దామరచర్లలో గుంజకు కట్టి కొట్టినా తప్పులేదు: కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- యాద్రి ప్లాంట్‌తో లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్లాన్ చేశారని ఆరోపణ
- విదేశీ బొగ్గు కోసమే దూరంగా ప్లాంట్ నిర్మాణం



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ మిగతా 2 లో



2లో

## ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత

- తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం
- నీటి వృథాను అరికట్టాలని లౌడ్‌స్పీకర్లతో ప్రచారం
- హైదరాబాద్‌కు నీటి గండం.. పొదుపుగా వాడాలంటూ లౌడ్‌స్పీకర్లతో ప్రచారం
- రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

# నవంబర్ 21న అన్ని కోర్టు ప్రాంగణాల్లో స్పెషల్ లోక్ అదాలత్

## చెక్ బౌన్స్ కేసుల త్వరిత పరిష్కారానికి చర్యలు

## ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌ల ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

## రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచన



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నవంబర్ 21న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పాల్గొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులకు సూచించారు. స్పెషల్ లోక్ అదాలత్‌కు ముందు ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సహకరించాలని కోరారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

## ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో ప్రక్రియ పూర్తి

## ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు సిబ్బంది కేటాయింపు

తిరుపతి, అక్టోబర్ 24: (మహి న్యూస్): తిరుపతి జిల్లా పరిధిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. ఎం. వరప్రసాద్ సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థతో పాటు పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో పోలింగ్ నిర్వహణ కోసం ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓల నియామకానికి ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, ఎన్ఐసీ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# 'దీపావళి వ్యాపారాన్నికాపాడండి'.. రాహుల్‌కు వ్యాపారుల విజ్ఞప్తి!

న్యూఢిల్లీ: ఢిల్లీలో దీపావళి పండుగ సీజన్ వ్యాపారానికి ఆటంకం కలుగుతుందనే ఆందోళనతో, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి నవంబర్ 1న తలపెట్టిన 'ఓట్ చోరీ' ర్యాలీని వాయిదా వేయాలని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ)లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కోరింది. అక్టోబర్ 24న రాసిన లేఖలో, ఈ ర్యాలీ కారణంగా రామ్‌లీలా మైదాన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, బారికేడ్లు, మెట్రో స్టేషన్ల మూసివేత వంటి చర్యలు ఉంటాయని, ఇది ప్రధాన మార్కెట్లలోని వ్యాపారాన్ని దెబ్బతీస్తుందని ట్రేడ్ బాడీ ఆవేదన వ్యక్తం చేసింది. 'దీపావళి షాపింగ్ సీజన్ పీక్స్‌లో ఉన్నందున, భాయ్ దూజ్ (నవంబర్ 10) తర్వాత ఈ ర్యాలీని నిర్వహించాల్సిందిగా మేము మిమ్మల్ని కోరుతున్నాము' అని ఆ లేఖలో పేర్కొన్నారు. ధనతేరస్, దీపావళి పండుగల్లో ఢిల్లీలో భారీ వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని సీటీఐ తెలిపింది. ఈ ఏడాది ధనతేరస్ నవంబర్ 6న, దీపావళి నవంబర్ 8న, భాయ్ దూజ్ నవంబర్ 10న వస్తున్నాయి. పండుగకు వారం రోజుల ముందే ప్రజలు షాపింగ్ ప్రారంభిస్తారు. బంగారం, వెండి నుంచి గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, బట్టలు, డ్రై ఫ్రూట్స్, మిఠాయిలు, ఆటోమొబైల్స్, ఫర్నిచర్, స్టేషనరీ, గిఫ్ట్ ఐటమ్స్ మొదలైనవి ఈ కాలంలో దాదాపు రూ. 25,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అలాగే అక్టోబరు నెలలో కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్, సెంట్రల్ ఢిల్లీలో జరిగిన నిరసనలు, ర్యాలీల వల్ల వ్యాపారులు ఇప్పటికే సుమారు రూ. 3,000 కోట్ల నష్టాన్ని చవిచూశారని ట్రేడ్ బాడీ పేర్కొంది. బయటి ప్రాంతాల నుంచి హోల్‌సేల్ మార్కెట్లకు సరుకులు రాకపోవడం, కస్టమర్లు రిటైల్ మార్కెట్లకు చేరుకోలేకపోవడం ఇందుకు కారణమని వివరించింది. రామ్‌లీలా మైదాన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో చాందినీ చౌక్, సదర్ బజార్, భగీరథ్ ప్యాలేస్, కాశ్మీరే గేట్, నై సడక్, దరిబా కలాన్, అజ్మేరీ గేట్, జామా మస్జిద్, కరోల్ బాగ్, లాజపత్ రాయ్ మార్కెట్ వంటి 20 చారిత్రక హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్ల నుంచి భారతదేశం అంతటికీ సరుకులు సరఫరా అవుతుంటాయి. ర్యాలీ కారణంగా ట్రాఫిక్ మళ్లింపులు, మెట్రో స్టేషన్ల మూసివేత ఈ మార్కెట్ల వ్యాపారాన్ని పూర్తిగా స్థంభింపజేస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా, రామ్‌లీలా మైదాన్‌కు సమీపంలో ఉన్న పాత ఢిల్లీ, కొత్త ఢిల్లీ రైల్వే స్టేషన్ల ద్వారా నిత్యం వేలాది మంది వ్యాపారులు, కొనుగోలుదారులు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్ల మూసివేత వల్ల వెలుపలి ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇక్కడకు రాకండా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల అవకతవకలు, బీజేపీపై 'ఓట్ చోరీ' ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఈ ర్యాలీని నిర్వహిస్తోంది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రియాంకా గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ తదితరులు ఉత్తరప్రదేశ్, హర్యానా నాయకులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ 'ఢిల్లీ చలో మార్చ్' నవంబర్ 1న జాతీయ రాజధానిని చేరుకుంటుందని, కనీసం 1 మిలియన్ (కోటి మంది) పౌరులు ఈ ర్యాలీలో పాల్గొనే అవకాశం ఉందని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ప్రత్యేక సవరణ (సర్) ఓటర్ల జాబితా ప్రక్రియలో అవకతవకలపై ప్రభుత్వపై ఒత్తిడి తెచ్చేందుకు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేయడానికి ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

# మరోసారి భారత్‌ను గెలికిన ట్రంప్.. నువ్వు మారవే!

న్యూఢిల్లీ: కుక్క తోక వంకర అన్న సామెత మనకు తెలిసిందే. దాని అర్థం ఎన్ని సార్లు చెప్పినా తన తీరు మార్చుకోరని.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విషయంలో ఈ సామెత సరిగ్గా సరిపోతుంది. భారత్-పాక్ యుద్ధం విషయంలో ఆయన వ్యాఖ్యలను పలు మార్లు భారత్ ఖండించినప్పటికీ ఆయన తీరు మార్చుకోవడం లేదు. తాజాగా మరోసారి ఇండియా-పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ప్రగల్భాలు పలికారు. అమెరికాలో వచ్చే నెలలో జరగబోయే మధ్యంతర ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా ట్రంప్ ప్రసంగించారు. తాను గతంలో చేసిన అంతర్జాతీయ దౌత్య విజయాలు, అధిక పన్నుల బాదుడుని అక్కడి ప్రజలకు గొప్పగా చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ" రెండు అణ్వాయుధ దేశాలైన భారత్, పాకిస్తాన్ మధ్య గతంలో సైనిక ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఆ సమయంలో నేను రెండు దేశాల నేతలతో మాట్లాడి... 'ఫ్రెండ్స్, మీరు గనుక ఇలాగే కొట్టుకుంటూ ఉంటే, అమెరికాతో వ్యాపారం చేయడం మర్చిపోండి. మీ రెండు దేశాల ఉత్పత్తులపై నేను 250% భారీ టారిఫ్‌లు (సుంకాలు) విధిస్తాను. ఇకపై మీరు మాతో ఎలాంటి బిజినెస్ చేయలేరు. అని గట్టిగా హెచ్చరించాను" అని సభలో చెప్పుకొచ్చారు. దీంతో అమెరికా మార్కెట్‌ను కోల్పోతామనే భయంతో, కోట్లాది డాలర్ల నష్టం వస్తుందనే ఆందోళనతో ఇరు దేశాల నేతలు తీవ్ర కోపానికి, ఆగ్రహానికి గురయ్యారని, కానీ చివరికి నా హెచ్చరికతో కాల్పులు ఆపేయడంతో యుద్ధం ముగిసిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘర్షణల సమయంలో ఇరు దేశాలకు చెందిన 11 సైనిక విమానాలు) కూలిపోయాయని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతే కాకుండా తన హయాంలో కేవలం భారత్-పాక్ మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా సుమారు 8 యుద్ధాలకు దారి తీసే పరిస్థితులను కేవలం ఆర్థిక ఒత్తిడి (టారిఫ్‌ల శక్తి) ద్వారానే పరిష్కరించానని ట్రంప్ ఈ ర్యాలీలో గర్వంగా ప్రకటించారు. తాను ఇంతటి దౌత్య విజయాలు సాధించినప్పటికీ, తనకు తగిన గుర్తింపు లభించలేదని ట్రంప్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. "నేను 8 యుద్ధాలను చక్కదిద్దాను. మరి నాకు నోబెల్ శాంతి బహుమతి వచ్చిందా? రాలేదు!" అని సభలో ప్రశ్నించారు. గతంలో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సైతం తనతో మాట్లాడుతూ "మీరు 2.5 కోట్ల నుండి 3 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడారు" అని కొనియాడినట్లు ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# గాల్లోనే ఢీకొన్న రెండు సైనిక విమానాలు.. నలుగురు మృతి



మనీలా: ఫిలిప్పీన్స్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. వైమానిక దళ శిక్షణ సమయంలో రెండు యుద్ధ విమానాలు దురదృష్టవశాత్తు ఒకదానికొకటి ఢీకొని గాల్లోనే కూలిపోయాయి. ఈ ఘటనలో అందులో ఉన్న నలుగురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. మనీలాకు దక్షిణంగా ఉన్న ఫెర్నాండో వైమానిక స్థావరం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రమాదానికి గురైన విమానాలు ఎస్ఎఫ్-260 రకానికి చెందిన సింగిల్ ప్రొపెల్లర్ శిక్షణ విమానాలుగా తెలుస్తోంది. ఈ ప్రమాదం జరగడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఫిలిప్పీన్స్ వైమానిక దళం ప్రతినిధి కల్నల్ అల్విన్ కాపింగుయాన్ తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఎస్ఎఫ్-260 రకానికి చెందిన అన్ని విమానాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. కాగా ఫిలిప్పీన్స్‌లో సైనిక విమానాలు ప్రమాదాలకు గురవడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మేలో ఉత్తర ఫిలిప్పీన్స్‌లోని బెంగ్వెట్ ప్రావిన్స్‌లో శిక్షణ విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు సైనిక పైలట్లు మరణించారు. అంతకుముందు 2023లోనూ ఎస్ఎఫ్-260 రకానికి చెందిన విమానం ప్రమాదానికి గురై ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా మరో ప్రమాదం జరగడంతో సైనిక విమానాల శిక్షణలో భద్రతా ప్రమాణాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

## ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి

### పరిగి పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంత్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ్ పుల్లారెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రాములు, పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్ లతో కలిసి పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: పరిగి పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటల కొనుగోలును సజావుగా నిర్వహించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడే కరువును రాజకీయాలకు ముడిపెట్టి ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో రాజకీయ విమర్శలు చేయడం కంటే, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంపై ప్రభావం పడే అవకాశాలున్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు పాటిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైతే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. కరువు పరిస్థితులపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, ప్రకృతి సంబంధిత వాతావరణ మార్పులను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రజిత వెంకటేష్, మండల పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యుబ్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండెల రామకృష్ణారెడ్డి, మాజీ నార్ మార్ఫ్ డైరెక్టర్ ఫిరంగి వెంకటరామిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, అక్బర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న నరసింహులు రామచంద్ర రెడ్డి,తౌరియా నాయక్, రాధాకృష్ణారెడ్డి, అన్వర్, రవి కాంత్ రెడ్డి,నాగవర్ధన్, నస్కల్ ముట్పూరి ఆనందం, నరేందర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఏసీలో చైనా కవ్వింపు



ఇరుగు పొరుగుతో సంబంధాలు చాలా సున్నితమైనవి. సరిహద్దు వివాదం ఉంటే అది అత్యంత సంక్లిష్టమైన వ్యవహారంగా మారుతుంది. పరిష్కారం సాధించదల్చుకున్న ప్పుడు ఇచ్చిపుచ్చుకోవడాలుంటాయి. అందులో కాస్త హెచ్చుతగ్గులుంటే చాలు... విపక్షాలు విరుచుకుపడతాయి. ఇక అవతలి సైన్యం బలవంతంగా చొరబడి ఘర్షణలకు దిగితే చెప్పేదేముంది? అరుణాచల్ ప్రదేశ్‌లోగల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) పొడవునా చైనాతో గత జూలైనుంచి పలుచోట్ల వివాదాలు తలెత్తుతున్నాయని ఇండో--టిబెటిన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) దళం చీఫ్ శత్రుజిత్ కపూర్ నోరు జారటం తాజా వివాదానికి కారణం. ఈ నెలాఖరున రిటైర్ కాబోతున్న సందర్భంగా రాజస్థాన్‌లోని ఆళ్వార్‌లో ఐటీబీపీలోని శౌర్య కమాండో దళం సమర్థతను ప్రశంసిస్తూ ఆయన ఈ మాటలన్నారు. అంతే, కాంగ్రెస్ వైపునుంచి విమర్శలు మొదలయ్యాయి. గత నెల 12న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చారు. 2020నాటి గల్వాన్ లోయ ఘర్షణల తర్వాత ఆయన మన దేశానికి రావటం ఇదే ప్రథమం. సరిహద్దులు ప్రశాంతంగా ఉంటేనే సాధారణ సంబంధాలు మెరుగుపడతాయనీ, దాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామనీ ప్రధాని నరేంద్ర మోదీ, జిన్‌పింగ్‌లు అవగాహనకొచ్చారు. శత్రుజిత్ చెబుతున్న ప్రకారం జూలైనుంచీ సరిహద్దుల్లో అలజడి ఉంటుండగా ఇరు దేశాల అధినేతల మధ్యా ఇంత సుహృద్భావం ఎలా సాధ్యమైందన్న సందేహం ఎవరికైనా వస్తుంది. కనీసం సెప్టెంబర్ తర్వాతైనా పరిస్థితి చక్కబడాలి కదా అనిపిస్తుంది. రక్షణ దళాల చీఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, విదేశాంగమంత్రి జైశంకర్ చైనా సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని వేర్వేరు సందర్భాల్లో చెప్పారు. ఎప్పటికప్పుడు సైన్యాధికారుల స్థాయి భేటీ జరగటంవల్ల ఆందోళన పడేంత అస్థిరత లేదని జనరల్ సుబ్రమణి తెలిపారు. జైశంకర్ అయితే 2024 ముందుకన్నా పరిస్థితి మెరుగ్గా ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో సహజంగానే శత్రుజిత్ మాటల్ని కాంగ్రెస్ అందిపుచ్చుకుంది. ఎల్ఏసీలో ఏం జరుగుతున్నదో దేశ ప్రజలకు తెలియాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలో ఉంటే... ఐటీబీపీ చీఫ్ చేసిన ఈ ప్రకటన ఎంత దుమారం రేపేదో ఊహించటం కష్టమేమీ కాదు. 1962 చైనా యుద్ధంలో అప్పటి ప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరువల్ల దేశానికి కలిగిన నష్టం గురించి ఇప్పటికీ తరచు బీజేపీ నేతలు చెబుతుంటారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు పొంతన లేకుండా మాట్లాడిన సందర్భం ఏర్పడితే బీజేపీ దాన్ని మామూలుగా వదిలేది కాదు. కాంగ్రెస్‌కున్న పరిమితులవల్ల అది ఆ స్థాయిలో స్పందించలేకపోతోందని చెప్పాలి. ఐటీబీపీ సేవలు నిరుపమానమైనవి. లద్దాఖ్‌లోని కారకోరం మొదలుకొని హిమాచల్‌లోని జరేప్ లా వరకూ గల 3,488 కిలోమీటర్ల నిడివుండే ఎల్ఏసీ అత్యంత ప్రమాద కరమైనది. అక్కడ ఆక్సిజెన్ లభ్యత అంతంతమాత్రం. శరీరం గడ్డకట్టేంత చలి. ఎత్తయిన కొండలు, చుట్టూ లోయలుండే ఆ ప్రాంతంలో ఏమాత్రం అప్రమత్తత కొరవడినా ప్రాణాలు మిగలవు. చైనా సైనికులు ఏదో చోట లోపలకి చొచ్చుకొచ్చి ఇదంతా తమదే నటం, కవ్వింపునకు దిగటం నిత్యకృత్యం. స్వల్ప తగాదా కూడా క్షణంలోనే ఉద్రిక్తంగా మారుతుంది. గస్తీ బాధ్యతల్లో ఉండే ఐటీబీపీ దళానికి ఓర్పు, సహనం, అవతలిపక్షానికి నచ్చజెప్పే నేర్పు, ఆ ఘర్షణను అక్కడికే పరిమితం చేయగలిగే వ్యూహం ఉంటేనే రోజు గడుస్తుంది. లేదంటే ఆ వివాదం విస్తరిస్తుంది. అందుకు గల్వాన్ లోయ ఘర్షణలే ఉదాహరణ. అక్కడ మన దళాలు చైనాకు గణనీయంగానే నష్టం కలిగించినా... మనవైపు 20మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మొత్తానికి ఐటీబీపీ చీఫ్ ప్రసంగం చూస్తే చైనా తన వెనకటి గుణం మానుకోలేదని అర్థమవుతుంది. అధినేతల స్థాయి సమావేశాల్లో పెద్ద మనిషి తరహాగా ఉండటం, క్షేత్రస్థాయిలో గిల్లికజ్జాలకు దిగటం మొదటినుంచీ దానికి అలవాటు. వాణిజ్యం, సరిహద్దు వివాదం-- దేనిదారి దానిదేననే చైనా వాదనను ఇకపై అంగీకరించకూడదు. చిత్తశుద్ధి లోపిస్తే సామరస్యత సాధ్యంకాదనీ, కవ్వింపు చర్యలకు స్వస్తి పలకాలనీ నిక్కచ్చిగా చెప్పాలి.

# అమెరికా సీక్రెట్ స్థావరాలపై వింత వస్తువులు.. ఏంటీ మిస్టరీ?



అమెరికా గగనతలంలో ఏదో జరుగుతోంది.. అత్యంత రహస్య సైనిక స్థావరాలపైనే గుర్తుతెలియని వస్తువులు ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం సృష్టించింది. అయితే, అవి మామూలు విమానాల్లా లేవు.. డ్రోన్లలా కనిపించడం లేదు.. గంటకు ఏకంగా 1,800 మైళ్ల వేగంతో దూసుకెళు తున్నాయి. శబ్దం లేదు.. పొగ లేదు.. ఇంజిన్ ఆనవాళ్లు లేవు. అసలు అవి ఎవరివి? అమెరికా ప్రయోగిస్తున్న అత్యాధునిక యుద్ధ సాంకేతికతా? శత్రు దేశాల నిఘా వ్యవస్థలా? లేక ఇన్నాళ్లూ చర్చల్లో ఉన్న యూఎఫ్ఓలేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్న తరుణంలో అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన కొత్త రహస్య పత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గుర్తుతెలియని వైమానిక దృగ్విషయాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బహిర్గతం చేసే కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 23న మరో విడత పత్రాలను విడుదల చేసింది. గత ఏడాది కాలంలో కనీసం మూడు సందర్భాల్లో రహస్య సైనిక స్థావరాలపై నల్లటి త్రిభుజాకార వస్తువులు కనిపించినట్లు ఈ పత్రాలు వెల్లడించాయి. ముఖ్యంగా, అమెరికా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించే పశ్చిమ ప్రాంతంలోని ఓ సున్నితమైన జాతీయ భద్రతా కేంద్రం సమీపంలో ఈ తరహా ఘటన నమోదైంది. అయితే, భద్రతా కారణాలతో ఘటన జరిగిన ఖచ్చితమైన ప్రాంతం, తేదీలను అధికారులు వెల్లడించలేదు.

### మూడు సెకన్లలో 2.4 కిలోమీటర్లు!

ఈ ఘటనకు సంబంధించిన నివేదికలోని వేగం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. సాక్షుల అంచనా ప్రకారం.. ఓ నల్లటి త్రిభుజాకార వస్తువు కేవలం మూడు సెకన్లలో 1.5 మైళ్ల దూరం ప్రయాణించింది. అంటే గంటకు సుమారు 1,800 మైళ్లు.. అంటే గంటకు దాదాపు 2,900 కిలోమీటర్లు. ఆ వేగం యుద్ధ విమానాన్ని తలపించినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఆ వస్తువు రెక్కల విస్తీర్ణం 9 నుంచి 15 అడుగుల వరకు, లోతు 6 నుంచి 9 అడుగుల వరకు, మందం 1 నుంచి 2 అడుగుల వరకు ఉన్నట్లు అంచనా వేశారు. దాని ఆకారాన్ని వివరించేందుకు అధికారులు కొన్ని స్కెచ్‌లను విడుదల చేశారు.

### ఇంజిన్ ఎక్కడుంది? శబ్దం ఎందుకు లేదు?

సాధారణ విమానం గాల్లో ప్రయాణిస్తుంటే దాని ఇంజిన్ శబ్దం, ఎగ్జాస్ట్ లేదా ఇతర సంకేతాలు గుర్తించే అవకాశం ఉంటుంది. కానీ ఈ త్రిభుజాకార వస్తువుల విషయంలో అలాంటి ఆనవాళ్లేవీ కనిపించలేదని సాక్షులు తెలిపారు. థర్మల్ పరికరాల ద్వారా పరిశీలించినప్పుడు వాటి ఉపరితలంపై దాదాపు ఒకే తరహా వేడి కనిపించినట్లు నివేదికల్లో పేర్కొన్నారు. సాధారణ విమానాలు, డ్రోన్లలో ఇంజిన్ ప్రాంతాల్లో కనిపించే ప్రత్యేకమైన వేడి వీటిలో గుర్తించలేకపోయారు. గాలి ప్రవేశ ద్వారాలు, ఇంజిన్ రంధ్రాలు, దిశను నియంత్రించే భాగాలు, కాక్‌పిట్ వంటి ఆనవాళ్లు కనిపించలేదని వివరించారు.

### అమెరికా భద్రతా వ్యవస్థకు కొత్త సవాలా?

అత్యంత ఆందోళన కలిగిస్తున్న విషయం వాటి వేగం ఒక్కటే కాదు.. అవి కనిపించిన ప్రాంతాలు కూడా. అమెరికా ప్రభుత్వం అత్యాధునిక సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించే సున్నితమైన కేంద్రాలపైనే గుర్తుతెలియని వస్తువులు సంచరించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అవి ఎవరి నియంత్రణలో ఉన్నాయి? అక్కడి సాంకేతిక పరిజ్ఞానాన్ని గమనించేందుకు వచ్చాయా? వాటి వెనుక ఏదైనా దేశం ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు.. ఇది అమెరికాకు చెందిన సాంకేతికత కాదని అధికారులు భావించినట్లు న్యూయార్క్ పోస్ట్ కథనం పేర్కొంది. అయినప్పటికీ, ఆ వస్తువులు ఇతర దేశాలకు చెందినవని నిర్ధారించే ఆధారాలు లేవు. వాటి అసలు స్వరూపం, ప్రయాణ విధానం, నియంత్రణ వ్యవస్థ గురించి కూడా స్పష్టత లేదు. ఖచ్చితమైన ప్రదేశాలు, తేదీలు రహస్యంగా ఉండటంతో స్వతంత్ర పరిశీలనకు పరిమితులు ఏర్పడ్డాయి.

### గ్రహాంతరవాసుల వాహనాలేనా?

ఈ వస్తువుల వివరాలు వెలుగులోకి రావడంతో అవి గ్రహాంతరవాసులకు చెందినవా? అనే చర్చ మరోసారి మొదలైంది. అయితే, ఇప్పటివరకు విడుదలైన పత్రాలు అలాంటి నిర్ధారణకు ఎలాంటి ఆధారాలనూ అందించలేదు. గుర్తుతెలియని వస్తువులు కనిపించాయని చెప్పడం ఒకటైతే, అవి భూమికి వెలుపల జీవుల నుంచి వచ్చాయని నిరూపించడం మరొకటి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. వాటి ఆకారం, వేగం, శబ్దం లేకుండా కదిలినట్లు వచ్చిన వాంగ్మూలాలు అసాధారణంగా కనిపిస్తున్నాయి. కానీ వాటి మూలం, పనిచేసే విధానం, అసలు స్వరూపం ఏమిటనేది ఇంకా మిస్టరీగానే మిగిలిపోయింది. అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన పత్రాలు ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోగా, మరిన్ని సందేహాలకు తెరతీశాయి.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

### ఈవీఎంల భద్రతపై అధికారులతో సమీక్ష

### పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే తనిఖీల్లో భాగంగా అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం ఉదయం స్థానిక క్లాక్ టవర్ సమీపంలోని పాత ఆర్డీఓ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మాలోలతో కలిసి గోదాముల తలుపుల లాక్ సీల్స్‌ను తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అమలవుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు లాగ్‌బుక్‌ను పరిశీలించడంతోపాటు సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అగ్నిమాపక పరికరాల అందుబాటుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, బెంచ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ రద్దు

### కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలోనూ పీజీఆర్ఎస్ నిలిపివేత

### అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దు

### జిల్లా ప్రజలకు కలెక్టర్ ఓ. ఆనంద్ సూచన



అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు అనంతపురం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికలు ముగిసే వరకు కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని, ఈ విషయాన్ని గమనించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ఓ. ఆనంద్, ఎస్పీ పి. జగదీష్

### టేబుళ్లు, బారికేడ్లు, రిసెప్షన్ ఏర్పాట్లు పూర్తి చేయాలి

### వర్షం పడినా ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి



అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ ఎన్నికల మెటీరియల్ పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ పి. జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు, బారికేడ్లు, రిసెప్షన్ తదితర ఏర్పాట్లను ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేయాలి, ఎన్ని రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించాలి అనే అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో వర్షం పడితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో డీఎస్పీ కరుణాకర్ రావు, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, రిటైర్డ్ ఎస్‌డీసీ గోవిందరాజులు, ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## అనంతపురంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ

### 1,654 మంది పోలింగ్ అధికారులకు శిక్షణ

### నవంబర్ 1న మున్సిపల్ ఎన్నికల పోలింగ్

### ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై అవగాహన



అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026లో భాగంగా నవంబర్ 1న నిర్వహించనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధులపై అనంతపురంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పీఓలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు (ఏపీఓలు) రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతపురంలోని ఎన్‌హెచ్-44 వద్ద ఉన్న నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా నియమితులైన 1,654 మంది అధికారులకు ఈ శిక్షణ ఇచ్చారు. రెండు బ్యాచ్‌లుగా నిర్వహించిన శిక్షణలో మొదటి బ్యాచ్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో బ్యాచ్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ అందించారు. నోడల్ ఆఫీసర్, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్నవారైనా, తొలిసారిగా విధులు నిర్వహిస్తున్నవారైనా ఎన్నికల నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శిక్షణలో వివరించిన అంశాలను శ్రద్ధగా తెలుసుకుని, సందేహాలను నివృత్తి చేసుకుని పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. అయూబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో పోలింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్ ఎస్. రోశయ్య పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది విధుల విభజన, పరస్పర సహకారం, సమన్వయం, ఎన్నికల నిర్వహణ ప్రక్రియను స్లైడ్‌ల ద్వారా వివరించారు. మరో మాస్టర్ ట్రైనర్ ఎర్రిస్వామి ఎన్నికల సామగ్రి, వివిధ ఫారమ్‌ల వినియోగం, వాటి నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు నారాయణ రెడ్డి, రవికుమార్‌తో పాటు వివిధ మున్సిపాలిటీలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



## అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలి

### జడ్పీటీసీ అభ్యర్థులకు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులకు రూ.4 లక్షల ఖర్చు పరిమితి

### ప్రతి మూడు రోజులకు ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి

### జిల్లా ఆడిట్ అధికారి వై. ఇందిరా





అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై పకడ్బందీగా ఆడిట్ నిర్వహించాలని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వ్యయ లెక్కల నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి వై. ఇందిరా సూచించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల ఖర్చుల వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డీపీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందం ఆధ్వర్యంలో జిల్లాలోని 31 మండలాలకు చెందిన ఎన్నికల వ్యయ లెక్కల పరిశీలకులు, సంబంధిత అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జడ్పీటీసీ అభ్యర్థులు గరిష్ఠంగా రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేయాలని తెలిపారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు అధికారికంగా నమోదు చేయని ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనధికారిక వ్యయాలను గుర్తించేందుకు సూక్ష్మస్థాయి పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ ఖర్చుల వివరాలను రిటర్నింగ్ అధికారికి లేదా అధికారం పొందిన అధికారికి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రొఫార్మా-1, 2, 3, 4లను సమర్పించే విధానం, ఖర్చుల రికార్డుల నిర్వహణపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. అభ్యర్థుల జాబితా



ప్రకటించిన తేదీ నుంచి వాస్తవ ఖర్చుల వివరాలను నిరంతరం నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 230-బి ప్రకారం, ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల్లోగా అభ్యర్థులు తుది ఎన్నికల ఖర్చుల లెక్కలను మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా జిల్లా ఎన్నికల ప్రాధికారులకు సమర్పించాలని అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులో లెక్కలు సమర్పించకపోయినా, ఖర్చుల వివరాల్లో అవకతవకలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, ఎన్నికల అకౌంటింగ్ అబ్జర్వర్ డీవీఎన్ కృష్ణ, జిల్లా అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. శైలజ, జిల్లా ప్రజా పరిషత్ విభాగం ఏ.ఓ. వీరాంజనేయులు, జిల్లా సహకార శాఖ, ఆడిట్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను నోడల్ అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలి

### ఎన్నికల ఏర్పాట్లు, సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

### నోడల్ అధికారులతో సమీక్షించిన జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్, కలెక్టర్ ఓ. ఆనంద్





అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల విధులను నోడల్ అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలని అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్, జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్, జిల్లా ఎస్పీ పి. జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నివేదికలను సకాలంలో అందించాలని నోడల్ అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత సిబ్బంది ర్యాండమైజేషన్‌ను వెంటనే పూర్తి చేసి, మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. మూడో విడత ర్యాండమైజేషన్‌ను ఈ నెల 30న నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను మరుసటి రోజుకు సిద్ధం చేసి, బ్యాలెట్ పేపర్ల ముద్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణ కోసం అవసరమైన ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించాలని, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సంబంధిత మున్సిపాలిటీల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయాలని, పోలింగ్ అధికారులకు సమన్వయంతో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ నివేదికలను ప్రతిరోజూ పంపించాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ)లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రిజిస్టర్లు నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు వంటి సదుపాయాలకు సంబంధించిన మరమ్మతులు పూర్తి చేయాలని, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.



జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందన్నారు. పోలీసు శాఖకు అవసరమైన ఇతర శాఖల సిబ్బందిని సమన్వయంతో కేటాయించాలని సూచించారు. జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని, వ్యయ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, పద్మావతి, మల్లికార్జునరెడ్డి, రమేష్ రెడ్డి, వెంకటనారాయణ, నోడల్ అధికారులు నాగరాజు నాయుడు, శైలజ, సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, డా. వెంకటేశ్వర్లు, ఓబులమ్మ, ఎన్ఐసీ డీఐఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్ ఓ. ఆనంద్

### ప్రతి కౌంటింగ్ కేంద్రంలో కనీసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేయాలి

### కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలి





అనంతపురం, అక్టోబర్ 24: (మహి న్యూస్): జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ పి. జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తనిఖీ చేశారు. కళాశాలలో మూడు మండలాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కౌంటింగ్ కేంద్రంలో కనీసం నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని, అవసరమైన చోట్ల బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ప్రారంభమై ఎలాంటి అంతరాయాలు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో డీఎస్పీ బి. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎన్నికల అధికారి సాలురెడ్డి, తహసీల్దార్ అరుణ, ఎంపీడీఓ రవిప్రసాద్, సీఐ మహానంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రలోభాలకు లొంగొద్దు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వినియోగించుకోండి

### - నిఘా వేదిక రాష్ట్ర సమన్వయకర్త కర్లపాటి పిలుపు




జగ్గయ్యపేట,మహి న్యూస్ అక్టోబర్ 24: జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ప్రజాస్వామ్య విలువలు, నైతిక ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను వేదిక రాష్ట్ర సమన్వయకర్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, జగ్గయ్యపేట కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా, కులం ఆధారంగా కాకుండా అభ్యర్థుల పనితీరు, ప్రజాసేవ పట్ల నిబద్ధత, స్థానిక సమస్యలపై వారి అవగాహనను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన కార్యాలయం లో కర్లపాటి మాట్లాడుతూ తాత్కాలిక ప్రయోజనాల కోసం తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలంలో ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభావం చూపుతాయన్నారు. ఓటర్లు తమ నిర్ణయాన్ని ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా స్వేచ్ఛగా తీసుకోవాలన్నారు. ఓటు అనేది కేవలం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే హక్కు మాత్రమే కాదని, ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రజలకు ఉన్న కీలకమైన సాధనమని పేర్కొన్నారు. అందుకే ఓటర్లు స్వతంత్రంగా ఆలోచించి, బాధ్యతతో నిర్ణయం తీసుకునేలా అవగాహన కల్పించడమే నిఘా వేదిక లక్ష్యం అని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి స్థానిక సమస్యలపై అభ్యర్థుల ప్రణాళికలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల హామీలు ఎంతవరకు ఆచరణ సాధ్యమో కూడా ఆలోచించాలన్నారు . ప్రతి ఓటరూ విచక్షణతో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## నీట్‌లో మంచి ర్యాంకు.. హృషికేశ్‌కు ఎంబీబీఎస్ ఉచిత సీటు!



కొడంగల్, మహిన్యూస్, అక్టోబర్ 24: తెలంగాణకు చెందిన కొత్తపల్లి గ్రామ విద్యార్థి కావాలి హృషికేశ్ నీట్‌లో మంచి ర్యాంకు సాధించి, కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ ఉచిత సీటు పొందాడు. ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో సీటు లభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. హృషికేశ్ తండ్రి కావాలి ఆనందం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని హృషికేశ్ స్వగృహంలో సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థి సాధించిన విజయంపై సత్యనారాయణ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కావాలి రాములు, నర్సిములు, కనకప్ప, కె. శ్రీనివాస్, కావాలి రాంచందర్ తదితరులు పాల్గొని హృషికేశ్‌కు అభినందనలు తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# ఏడవ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం

## ఎమ్మెల్యే ఆదేశాలు, చైర్మన్ కేశవరెడ్డి సూచనల మేరకు ప్రచారం నిర్వహించిన పేరు పోగు దావీదు



మాచర్ల అక్టోబర్ 24: (మహి న్యూస్): మాచర్లలో ఏడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పేరు పోగు దావీదు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాలు, చైర్మన్ కేశవరెడ్డి సూచనల మేరకు వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని పేరు పోగు దావీదు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. టీడీపీ నాయకులు, ఆలేటి వాసు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పార్టీ విధానాలను వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జి.ఎం.సి, తెనాలిలో 27, 28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు

## ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

## పోలింగ్ సామగ్రి పంపిణీలో జాప్యం ఉండకూడదు

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ



గుంటూరు, అక్టోబర్ 24: (మహి న్యూస్): గుంటూరు నగర పాలక సంస్థ (జి.ఎం.సి), తెనాలి పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. శనివారం మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణకు ముందస్తు ఏర్పాట్లు చేసి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోలింగ్ సామగ్రి పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకూడదని, అవసరమైన సామగ్రి మొత్తం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఓటర్లకు ఫోటో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఆహార పంపిణీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. అవసరమైన వాహనాల సంఖ్య, రూట్లలో ప్రయాణించగల వాహనాలను ముందుగానే గుర్తించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 26న మైక్రో పరిశీలకులకు శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో 596 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభమైందని చెప్పారు. తెనాలి పురపాలక సంఘం పరిధిలో 185 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, నాలుగు జోన్లు, 18 రూట్లు ఏర్పాటు చేశామని కమిషనర్ జె. రామ అప్పల నాయుడు తెలిపారు. సప్లిమెంటరీ ఓటరు జాబితా అందినట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ నామినేషన్ల పరిశీలన పూర్తి..

# బరిలో 115 మంది అభ్యర్థులు

## రెండు నామినేషన్లు తిరస్కరణ

## బొల్లాపల్లి, నాదెండ్లలో ఒక్కొక్క నామినేషన్ తిరస్కరణ

## వెల్లడించిన జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్ష



పల్నాడు, అక్టోబర్ 24: (మహి న్యూస్): పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. మొత్తం 115 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని జిల్లా జాయింట్ కలెక్టర్, జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్ష వెల్లడించారు. జిల్లాలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. బొల్లాపల్లి మండలంలో ఒకటి, నాదెండ్ల మండలంలో ఒక నామినేషన్ తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో





భాగంగా స్క్రూటినీ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన పరిశీలన ప్రక్రియను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కన్నబాబు జిల్లాలో పర్యటించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు.

# ఒప్పిచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఆయుష్ వైద్య శిబిరం

## సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

## వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

## 201 మందికి ఉచితంగా ఆయుష్ మందుల పంపిణీ



కారంపూడి ఒప్పిచర్ల అక్టోబర్ 24: (మహి న్యూస్ ): పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సుతో పాటు ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు కారంపూడి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా తగినంత నీరు తాగాలని తెలిపారు. రోజూ తగినంత నీటితో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్లను తీసుకోవడం మంచిదని సూచించారు. దైనందిన జీవనశైలి, ఋతుచర్య ప్రాముఖ్యతను వివరించి, ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

### విద్యార్థులకు యోగా శిక్షణ

ఈ కార్యక్రమంలో పాల్గొన్న యోగా ఉపాధ్యాయుడు



నరసింహారావు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించి, వాటి ప్రయోజనాలను వివరించారు. వైద్య శిబిరంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆయుష్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 201 మందికి ఉచితంగా మందులు అందించారు.

### వైద్య సిబ్బందికి ప్రధానోపాధ్యాయుడి కృతజ్ఞతలు

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విల్సన్ చౌరి మాట్లాడుతూ తమ పాఠశాలలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించడంతో పాటు యోగా శిక్షణ అందించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 201 మందికి ఉచితంగా ఆయుష్ మందులు అందించిన డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌తో పాటు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వెంకయ్య, లలిత, సుగుణ, పెద్దబ్బాయి, హెల్త్ సూపర్‌వైజర్ మస్తాన్ వలి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ లాలు నాయక్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవంబరు 1న పోలింగ్ సందర్భంగా స్థానిక సెలవు

## గుంటూరు నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం పరిధిలో సెలవు

## అక్టోబర్ 31, నవంబరు 1, 3 తేదీల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల భవనాలకు సెలవులు

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ

గుంటూరు, అక్టోబర్ 24: (మహి న్యూస్): గుంటూరు నగర పాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం పరిధిలో నవంబరు 1వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. శనివారం మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. పోలింగ్ నిర్వహించే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు స్థానిక సెలవు వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 పరిధిలోకి వచ్చే సంస్థలకు కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే పోలింగ్‌కు ముందు రోజు అక్టోబర్ 31, పోలింగ్ రోజు నవంబరు 1, ఓట్ల లెక్కింపు రోజు నవంబరు 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు స్థానిక సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ చర్యలపై ఏపీపీసీబీ అధికారుల తనిఖీలు

## జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఆంధ్రా సిమెంట్స్ పరిశ్రమలో తనిఖీలు

## ఉద్గారాలు, మురుగునీటి శుద్ధి వ్యవస్థల పనితీరుపై సమీక్ష

## పర్యావరణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమలకు సూచన





గుంటూరు, అక్టోబర్ 24: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) సభ్య కార్యదర్శి ఎస్. శర్వణన్, ఐఎఫ్ఎస్, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. రాజశేఖర్ గుంటూరు జిల్లాలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, పల్నాడు జిల్లాలోని ఆంధ్రా సిమెంట్స్ పరిశ్రమను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుంటూరు ప్రాంతీయ కార్యాలయ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, ప్రాంతీయ అధికారి ఎం.డి. నజీనా బేగం పాల్గొన్నారు. రెండు పరిశ్రమల్లో కార్యకలాపాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, కాలుష్య నియంత్రణ పరికరాల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులకు వివరించారు. జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో వ్యర్థాల నిర్వహణ, ప్రాసెసింగ్, దహన ప్రక్రియలు, ఫర్నేస్‌ల పనితీరు, వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు, ఉద్గారాల పర్యవేక్షణ వ్యవస్థలను అధికారులు



పరిశీలించారు. మురుగునీటి ఉత్పత్తి, శుద్ధి, పునర్వినియోగం, పారవేతకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. పర్యావరణంపై ప్రభావం తగ్గించేలా సమర్థవంతమైన కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. పల్నాడు జిల్లాలోని ఆంధ్రా సిమెంట్స్ పరిశ్రమలో ఉత్పత్తి కార్యకలాపాలు, కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరు, ముడి పదార్థాల నిర్వహణ సమయంలో వెలువడే దుమ్మును నియంత్రించే విధానాలను పరిశీలించారు. దుమ్ము ఉద్గారాలను తగ్గించడంతోపాటు కాలుష్య నియంత్రణ పరికరాలను నిరంతరం సమర్థవంతంగా నిర్వహించాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి ఎస్. శర్వణన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఏపీపీసీబీ నిబంధనలు, అనుమతుల్లో విధించిన షరతులు, పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉద్గారాలు, మురుగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ప్రాంగణంలో ఏపీపీసీబీ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పచ్చదనాన్ని పెంపొందించడం, కాలుష్య నివారణ చర్యలను బలోపేతం చేయడం ప్రతి పరిశ్రమ బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. పరిశ్రమల కార్యకలాపాల వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలగకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తూ పర్యావరణ నిబంధనల అమలును పర్యవేక్షిస్తామని ఏపీపీసీబీ అధికారులు తెలిపారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

## ఈవీఎంల భద్రతా ఏర్పాట్ల పరిశీలన

## సీసీ కెమెరాలు, తాళాలు, సీళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

## భద్రతా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచన



గుంటూరు, అక్టోబర్ 24: (మహి న్యూస్): గుంటూరు జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి ఎం. శ్రీనివాసరెడ్డి, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణారెడ్డి, రహదారులు భవనాల శాఖ డీఈ హజరతయ్య, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మాచర్ల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యెనుముల సుష్మ కేశవరెడ్డి కుటుంబానికి మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ మద్దతు



మాచర్ల అక్టోబర్ 24 (మహి న్యూస్) : మాచర్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో యెనుముల సుష్మ కేశవరెడ్డి కుటుంబానికి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మసీదు సమీపంలో పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలను కలుసుకుని మాట్లాడారు. కేశవరెడ్డి అన్న కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులను కోరినట్లు సమాచారం. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రజల కోసం కృషి చేస్తున్నారని, ఆయన ఆశీస్సులు కేశవరెడ్డి కుటుంబానికి ఉన్నాయని షేక్ మదార్ సాహెబ్ పేర్కొన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో మాచర్ల అభివృద్ధి కొనసాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మాచర్ల అభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ కేశవరెడ్డి కుటుంబానికి మద్దతుగా నిలవాలని ఆయన స్థానికులను కోరినట్లు సమాచారం.

# ప్రతి వార్డులో పసుపు జెండా రెపరెపలాడాలి

## 30వ వార్డులో టీడీపీ అభ్యర్థుల తరపున యెనుమల కేశవరెడ్డి ఇంటింటి ప్రచారం



మాచర్ల అక్టోబర్ 24:(మహి న్యూస్) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 30వ వార్డులో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యెనుమల కేశవరెడ్డి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి యెనుమల సుష్మా కేశవరెడ్డి, 30వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి షేక్ జానీ భాష తరపున ఆయన ప్రజలను కలిసి పార్టీ విజయానికి మద్దతు కోరారు. ఈ సందర్భంగా యెనుమల కేశవరెడ్డి మాట్లాడుతూ, ఓటర్లు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి చైర్మన్ అభ్యర్థి యెనుమల సుష్మా కేశవరెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థి షేక్ జానీ భాషను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కౌన్సిలర్ అభ్యర్థి షేక్ జానీ భాష వార్డులోని గడపగడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పల్నాడు జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి శాంతి నాయుడు, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమెర అనంత రాములు, టీడీపీ నాయకులు దుర్భాగుల ప్రసాదు, బూత్ ఇన్‌చార్జి మస్తాన్ వలి, పట్టణ టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రసూల్, షేక్ జాన్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ నటువ రవి, నారాయణరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షురాలు కండె పార్వతి, బీసీ నాయకుడు బాదం బాయ్, జనసేన నాయకుడు షేక్ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనకు తేదీలు ఖరారు

## తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో 1,000 దరఖాస్తులు, 1,700 బాండ్ల పరిశీలన

## అక్టోబర్ 26, 27 తేదీల్లో ఆయా మండలాల బాండ్ల పరిశీలన

## అక్టోబర్ 28 నుంచి 31 వరకు తాడేపల్లి, దుగ్గిరాల మండలాల బాండ్ల పరిశీలన



గుంటూరు, అక్టోబర్ 24: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనలో భాగంగా అక్టోబర్ 21 నుంచి 24 వరకు తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలకు చెందిన బాండ్లను పరిశీలించినట్లు సీఐడీ గుంటూరు ప్రాంతీయ అధికారి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి. సీతారామయ్య తెలిపారు. ఈ పరిశీలనలో సుమారు 1,000 దరఖాస్తులు, 1,700 బాండ్లను పరిశీలించారు. అక్టోబర్ 26, 27 తేదీల్లో కూడా ఇదే మండలాలకు సంబంధించిన బాండ్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 28 నుంచి 31 వరకు తాడేపల్లి, దుగ్గిరాల మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్లను పరిశీలించనున్నారు. ఆయా మండలాల బాండ్ హోల్డర్లు నిర్ణీత తేదీల్లో గుంటూరు మెడికల్ కాలేజీ వెనుకవైపు ఉన్న సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. బాధితులు తమ వెంట అసలు బాండ్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, సంబంధిత జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని అధికారులు తెలిపారు.





EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం - కర్నూలు జిల్లాలో 10వ తేదీ నుంచి ప్రారంభం

### జనరల్ డ్యూటీ అసిస్టెంట్, టైలరింగ్‌లో శిక్షణ

### శిక్షణతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు

కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): నందమూరి తారకరామారావు వైద్యాభివృద్ధి మరియు మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ వారి సహకారంతో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాలు నవంబర్ 10, 2026 నుంచి ప్రారంభం కానున్నాయి.

**శిక్షణ కార్యక్రమాల వివరాలు:**

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (జీడీఏ) -- 60 రోజులు.
టైలరింగ్ -- 60 రోజులు.
రోజుకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ అందించనున్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.
వివరాలకు జిల్లా మేనేజర్‌ను సంప్రదించవచ్చు. ఫోన్: 7095977716

# అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు

### ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో నమోదు కార్యక్రమం

### అక్టోబర్ 26 నుంచి 31 వరకు పరిశీలన

### అసలు బాండ్లు, ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్ తీసుకురావాలి




కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు సీఐడీ ప్రాంతీయ కార్యాలయం, కర్నూలు అడిషనల్ ఎస్పీ ఎన్. పూజిత తెలిపారు.

**నమోదు నిర్వహించే తేదీలు, ప్రాంతాల వివరాలు:**

అక్టోబర్ 26, 27: వెల్దుర్తి
అక్టోబర్ 28, 29: గడివేముల
అక్టోబర్ 30: కోడుమూరు
అక్టోబర్ 31: దొర్నిపాడు
సమయం: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.
వేదిక: ప్రాంతీయ సీఐడీ కార్యాలయం, ఏపీ టూరిజం హోటల్ సమీపంలో, రామలింగేశ్వర నగర్, కర్నూలు.

బాధితులు తమ అసలు బాండ్లు లేదా రసీదులు, సంతకం చేసిన కలర్ జిరాక్స్ ప్రతులు, ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్‌తో పాటు వర్తించే ఇతర పత్రాలను తీసుకురావాలి. అసలు బాండ్లను పరిశీలన కోసం మాత్రమే చూపించాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు ఇన్‌స్పెక్టర్లు ఎన్.ఎస్.ఎం. శ్రీధర్ (94411 66600), డి. లలిత (94916 67878)ను సంప్రదించవచ్చు.

# కల్లూరు అర్బన్ 25వ వార్డులో టీడీపీ అభ్యర్థి తరపున గౌరు చరిత రెడ్డి ప్రచారం

### టెలికాం నగర్‌లో ఇంటింటి ప్రచారం

### కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్ 25వ వార్డు టెలికాం నగర్‌లో పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి పెరుగు పురుషోత్తం రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెరుగు వేణు, కలవతమ్మ, అరుణ్ కుమార్ రెడ్డి, మైనారిటీ నాయకుడు చాంద్ బాషా, వార్డు నాయకులు శ్రీకాంత్, చిన్ని, కాలనీ మహిళలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కర్నూలు జిల్లా జైలు భద్రతను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

### సీసీ కెమెరాలు, ఖైదీల బ్యారక్‌లు, భద్రతా ఏర్పాట్ల తనిఖీ

### భద్రతా లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన

### ఖైదీలు తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని పరివర్తన చెందాలి



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): కర్నూలు జిల్లా జైలు భద్రతను సమీక్షించడంతోపాటు భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం పంచలింగాల సమీపంలోని జిల్లా జైలును సందర్శించి తనిఖీ చేశారు. సెక్యూరిటీ రివ్యూ కమిటీ సమావేశంలో భాగంగా జైలు పరిసరాలు, ఖైదీల బ్యారక్‌లు, సందర్శకుల గది, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. జైలు భద్రత, ఖైదీల పరిరక్షణ, ఖైదీలను కోర్టులకు తరలించే ఎస్కార్ట్ విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఖైదీలు జైలు జీవితాన్ని గుణపాఠంగా తీసుకుని, గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. వారిలో సత్ప్రవర్తన, పరివర్తన పెంపొందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఖైదీల కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. జైలులో భద్రతా లోపాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఖైదీలను కోర్టులకు తరలించే సమయంలో ఎస్కార్ట్ సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జైలు భద్రతను కాపాడటంతోపాటు ఖైదీలలో సానుకూల మార్పు తీసుకురావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జైలు పరిసరాలు, నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించిన ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేసి విజిటింగ్ బుక్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎన్. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సబ్ జైళ్ల అధికారి జి. రామకృష్ణ యాదవ్, జైలర్ జి. ఎరికి నాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, ఆర్ఐ ఎస్. జావీద్, డిప్యూటీ జైలర్లు సి. అయ్యావార్ రెడ్డి, డి. నాగరాజు, ఇతర జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

### మొదటి రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చాలి

### మొబైల్ ఐసీటీసీ వాహనాల ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలి

### హెచ్ఐవీ బాధితులకు నిరంతర వైద్య సేవలు అందించాలి

కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెచ్ఐవీ బాధితులను ముందస్తుగా గుర్తించడం, వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం, చికిత్సకు దూరమైన వారిని తిరిగి చికిత్స పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం అమలు, హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాల సాధనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొదటి 95 లక్ష్యం 93 శాతం, రెండో 95 లక్ష్యం 90 శాతం, మూడో 95 లక్ష్యం 95 శాతంగా ఉందని తెలిపారు. మొదటి రెండు లక్ష్యాలను 100 శాతానికి చేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. మొబైల్ ఐసీటీసీ వాహనాల ద్వారా హెచ్ఐవీ పరీక్షల పరిధిని విస్తరించాలని, హెచ్ఐవీ ప్రమాదం ఎక్కువగా ఉన్న వర్గాలకు విస్తృతంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కౌన్సెలింగ్, వైద్య సేవలు అందించాలని సూచించారు. కీలక ప్రాంతాల్లో పరీక్షల సంఖ్యను పెంచి హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చికిత్సకు దూరమైన లాస్ట్ టు ఫాలోఅప్ (ఎల్ఎఫ్‌యూ) కేసులను గుర్తించి, వారిని తిరిగి క్రమం తప్పకుండా చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా ఫోన్ ద్వారా సంప్రదించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. కేర్ సపోర్ట్ సెంటర్ల ద్వారా హెచ్ఐవీ బాధితుల చిరునామాలను ధ్రువీకరించడం, చికిత్సకు దూరమైన వారిని గుర్తించి తిరిగి వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఏఆర్‌టీ మందులను నిరంతరాయంగా వినియోగించేలా కౌన్సెలింగ్ అందించాలని, కొత్తగా హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారిని వీలైనంత త్వరగా ఏఆర్‌టీ చికిత్సకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా బాధితుల కుటుంబ సభ్యులు, జీవిత భాగస్వాములు, పిల్లలు, తల్లిదండ్రులు, ఇతర ప్రాథమిక కాంటాక్టులను గుర్తించి అవసరమైన పరీక్షలు, కౌన్సెలింగ్, వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

**గణాంకాల ఆధారంగా పురోగతిని సమీక్షించాలి**

జిల్లాలో గుర్తిస్తున్న హెచ్ఐవీ కేసుల వివరాలను గత ఏడాది గణాంకాలతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రస్థాయి గణాంకాలతో పోల్చి విశ్లేషణాత్మక నివేదికలు సమర్పించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. కామేశ్వర ప్రసాద్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా. భాస్కర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, సహాయెగి మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

### అక్టోబర్ 27న దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో కేంద్రం

### ఎన్నికల విధుల్లో ఉన్న అర్హులైన సిబ్బంది, పోలీసులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం

### ఓటరు జాబితా వివరాలు, ఎన్నికల విధుల ఉత్తర్వులు తప్పనిసరి

### అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో పేరుండి, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అర్హులైన ఉద్యోగులు, పోలీసు సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నెల 27న ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. నగరంలోని పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చే సిబ్బంది కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేరుకు సంబంధించిన వివరాలు, ఎన్నికల విధులు కేటాయించినట్లు సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. గెజిటెడ్ అధికారుల ద్వారా అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తిచేసిన అనంతరం అర్హులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**నవంబర్ 1న పోలింగ్.. 3న ఓట్ల లెక్కింపు**

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. వార్డుల పునర్విభజన అనంతరం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 68 వార్డులు ఉన్నాయని, మొత్తం 4,79,861 మంది ఓటర్ల కోసం 487 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 3న అథెనా స్కూల్‌లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 25న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది తమ బాధ్యతలను తప్పనిసరిగా నిర్వర్తించాలని, అనుమతి లేకుండా విధుల నుంచి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, ఎన్నికల విధుల కారణంగా తమ ప్రాంతంలో ఓటు వేయలేని అర్హులైన సిబ్బంది ఈ నెల 27న ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్‌ను వినియోగించుకుని నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

# ఎన్నికల విధుల్లో అప్రమత్తత, నిబంధనల అమలు కీలకం

### పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించి ప్రతి అంశాన్ని నమోదు చేయాలి

### ఎన్నికల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

### మైక్రో అబ్జర్వర్లకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలు పక్కాగా అమలవుతున్నాయా లేదా నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యలు ఎదురైతే నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని పోలింగ్ ఏజెంట్లకు చూపించడం, పేపర్ సీల్ వేయడం, అవసరమైన సంతకాలు తీసుకోవడం, ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారి ఎన్నికల విధులను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా గమనించాలని తెలిపారు. ఓటర్లకు చెరగని సిరా గుర్తు వేయడం, ఓటర్ల రిజిస్టర్లలో సంతకాలు తీసుకోవడం, బ్యాలెట్ పేపర్ల పంపిణీ, ఓటింగ్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నాయా పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తికి ఓటరు స్లిప్ లేదనే కారణంతో మాత్రమే ఓటు హక్కును నిరాకరించకూడదని, ఎన్నికల సంఘం గుర్తించిన చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాన్ని సమర్పిస్తే నిబంధనల ప్రకారం ఓటు వేసేందుకు అనుమతించాలని తెలిపారు. సీనియర్ సిటిజన్లు, గర్భిణులు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం ప్రాధాన్యత కల్పిస్తున్నారా గమనించాలని సూచించారు. అంధులు, ప్రత్యేక పరిస్థితుల్లో ఓటు వేసే వారికి సంబంధించిన విధానాలను ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అమలు చేస్తున్నారా పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మీడియా ప్రతినిధుల ప్రవేశం కూడా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి ముందే క్యూలో ఉన్న ఓటర్లందరికీ నిబంధనల ప్రకారం టోకెన్లు జారీ చేసి, ఓటు వేసే అవకాశం కల్పించాలని తెలిపారు. నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కొత్త ఓటర్లను క్యూలోకి అనుమతించే విషయంలో ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పేపర్ల లెక్కలు, పేపర్ సీల్ ఖాతా, ప్రిసైడింగ్ అధికారి డైరీ, ఇతర ఎన్నికల రికార్డులను సక్రమంగా నిర్వహించారా లేదా మైక్రో అబ్జర్వర్లు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ సమయంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను ప్రిసైడింగ్ అధికారి డైరీలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. భవిష్యత్తులో ఫిర్యాదులు, న్యాయపరమైన అంశాలు తలెత్తినప్పుడు ఈ రికార్డులు ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు వాస్తవాలను నిర్ధారించకుండా నిర్ణయానికి రావద్దని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పరిష్కరించలేని సమస్యలపై నోడల్ అధికారి, సాధారణ పరిశీలకుడు లేదా జిల్లా ఎన్నికల అధికారికి వెంటనే సమాచారం అందించాలన్నారు. నిర్ధారణ కాని సమాచారాన్ని



ప్రచారం చేసి గందరగోళం సృష్టించకూడదని స్పష్టం చేశారు. మైక్రో అబ్జర్వర్లు శిక్షణలో అందించిన సమాచారాన్ని పూర్తిగా అధ్యయనం చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై స్పష్టత తెచ్చుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, సజావుగా జరిగేలా తమ బాధ్యతలను అప్రమత్తతతో నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారెడ్డి, సీపీఓ భారతి, ఎల్‌డీఎం పి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సు

### హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలి

### మైనర్లు వాహనాలు నడిపితే యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు

### రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న వారికి రూ.25 వేల ప్రోత్సాహకం

### కర్నూలులో అవగాహన కల్పించిన న్యాయ, పోలీసు, రవాణా శాఖ అధికారులు




కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం కర్నూలులోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల (టౌన్ మోడల్)లో రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అతివేగం, ఓవర్‌లోడింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. మైనర్లు కారు లేదా బైక్ నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు లేదా తల్లిదండ్రులకు రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ భరత్ సింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రహవీర్ పథకం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తారని వివరించారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లే వారు చట్టపరమైన ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన రక్షణ ఉంటుందని తెలిపారు. రెండో పట్టణ పోలీస్ సీఐ మధు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానాతో పాటు గరిష్ఠంగా ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నమూనా ద్వారా రహదారి వ్యవస్థ, ట్రాఫిక్ సిగ్నల్లు, జంక్షన్లు, జీబ్రా క్రాసింగ్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్ ద్వారా ప్రజలు ఖర్చు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ సురేష్ బాబు, ఆర్టీఓ భరత్ సింగ్, డిప్యూటీ డీఈవో శ్రీధర్ బాబు, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, టూ టౌన్ సీఐ మధు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సులోచన, కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక సెలవులు..!

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ అక్టోబరు 24 : వైఎస్సార్ కడప జిల్లాలో సాధారణ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన ఎన్నికల ప్రకటన మేరకు నవంబరు 1న కడప నగరపాలక సంస్థ, జిల్లాలోని పురపాలక సంఘాలు, నగర పంచాయతీల పరిధిలో పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, అలాగే పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణకు వీలుగా సెలవులు ప్రకటించారు.

**సెలవుల వివరాలు :**

అక్టోబరు 31 (శనివారం): పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు స్థానిక సెలవు ప్రకటించారు.

నవంబరు 1 (ఆదివారం): పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్థానిక సెలవు ప్రకటించారు. ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు వర్తిస్తుంది.

నవంబరు 3 (మంగళవారం): ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాలకు స్థానిక సెలవు ప్రకటించారు. సెలవుల అమలుకు సంబంధించి జిల్లాలోని అన్ని శాఖల అధిపతులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సంబంధిత జిల్లా అధికారులకు పంపించడంతోపాటు, ఎన్నికల సెలవుల వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖకు సూచించారు.

# మైదుకూరు మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు

## రేపు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ

## మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది అభ్యర్థుల జాబితా ప్రకటన

కడప జిల్లా/మైదుకూరు, అక్టోబర్ 24 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు మైదుకూరు పురపాలక సంఘం రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను మున్సిపల్ అధికారులు వెల్లడించారు. 2026 అక్టోబర్ 16 నుంచి 18 వరకు, అలాగే అక్టోబర్ 23, 24 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు సంబంధించి అక్టోబర్ 25న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1, 2026న పోలింగ్, నవంబర్ 3, 2026న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సవరించిన షెడ్యూల్‌ను గమనించి, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తదితర ఎన్నికల ప్రక్రియలకు నిర్ణీత సమయాల్లో హాజరుకావాలని అధికారులు సూచించారు.

# ఎంపీటీసీ అభ్యర్థిత్వంపై న్యాయం చేయాలని టీడీపీ అధిష్టానానికి పడిగల శివబాలయ్య వినతి

టి. సుండుపల్లె, మహిన్యూస్, అక్టోబర్ 24: తెలుగుదేశం పార్టీ కోసం సుమారు 35 ఏళ్లుగా పనిచేస్తున్న తనకు ఎంపీటీసీ అభ్యర్థిత్వం విషయంలో న్యాయం చేయాలని కోరుతూ రాజంపేట నియోజకవర్గం, టి. సుండుపల్లె మండలం రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పడిగల శివబాలయ్య పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి టీడీపీకి విధేయుడిగా ఉంటూ, పార్టీ అప్పగించిన కార్యక్రమాలను నిర్వహిస్తూ సేవలందిస్తున్నానని శివబాలయ్య తన వినతిపత్రంలో పేర్కొన్నారు. రాయవరం గ్రామంలో ఎంపీటీసీ స్థానం బీసీ వర్గానికి రిజర్వు కావడంతో, స్థానిక మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు, కార్యకర్తల సూచన మేరకు తన భార్య పడిగల సములతను టీడీపీ అభ్యర్థిగా నిలబెట్టి నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. అయితే, గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి, ప్రస్తుతం టీడీపీలో చేరిన మహమ్మద్ రఫీక్ తన భార్య అభ్యర్థిత్వానికి పోటీగా మరికొందరిని నామినేషన్లు వేయించారని శివబాలయ్య ఆరోపించారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న తనకు అవకాశం కల్పించాలని, అభ్యర్థిత్వం విషయంలో పార్టీ నాయకత్వం తన విజ్ఞప్తిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. రాయవరం ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలను కూడా ఆయన తన వినతిపత్రంలో ప్రస్తావించారు. పడిగల సములత (టీడీపీ), షేక్ జరీనా బేగం, సంబేటి సంధ్యారాణి, బొజ్జ సావిత్రమ్మ, షేక్ సున్నీజాన్ పేర్లను పేర్కొన్నారు. పార్టీ కోసం తాను చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని, తన భార్య అభ్యర్థిత్వానికి అవకాశం కల్పించేలా పార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకోవాలని పడిగల శివబాలయ్య విజ్ఞప్తి చేశారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

## అన్నదానమే మహాదానం.. సేవా కార్యక్రమాలు అభినందనీయం

## - డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 24: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్రేమలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబేపల్లి వాస్తవ్యులు పొన్నపల్లి సరోజ, రామచంద్ర దంపతుల కుమార్తె లక్ష్మీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ, అన్నదాన కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, అవసరమైన వారికి అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. పుట్టినరోజులు, ఇతర శుభ సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన లక్ష్మీదేవి మాట్లాడుతూ, తన జన్మదినం సందర్భంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేయాలనే ఉద్దేశంతో వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, ప్రేమలయం వృద్ధాశ్రమం మేనేజర్ దేవనాథ రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి..!

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

## అనుమతి లేకుండా ప్రకటనలు విడుదల చేస్తే చర్యలు

కడప, మహి న్యూస్ అక్టోబరు 24: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్ ఢ ఎలెక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచార ప్రకటనలు విడుదల చేయడానికి ఎన్నికల నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ విషయంలో ప్రసార మాధ్యమాలు.. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, అనుమతి లేకుండా ప్రచార ప్రకటనలు విడుదల చేసే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మేయర్, చైర్మన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ప్రకటనల సారాంశాన్ని ముందుగా జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ) పరిశీలనకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రకటనలకు సంబంధించిన కంటెంట్ వివరాలను రెండు పెన్ డ్రైవ్‌లలో అందజేయాలని తెలిపారు. ఎంసీఎంసీ పరిశీలించి అనుమతి ఇచ్చిన తర్వాతే సంబంధిత ప్రచార ప్రకటనలను ప్రసార మాధ్యమాల ద్వారా విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో పారదర్శకతను పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని అభ్యర్థులకు సూచించారు. ఎన్నికల ప్రచార ప్రకటనలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసి కేంద్రంలో సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం

## ప్రజలకు న్యాయ అవగాహన కల్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



కడప, అక్టోబర్ 24 (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలోని స్ట్రీట్ నంబర్ 1లో శనివారం మధ్యవర్తిత్వంపై ప్రజలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రోద్దీన్ సూచనల మేరకు మధ్యవర్తి వి. రాజా గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ



పొందిన మధ్యవర్తులు, న్యాయవాదులు మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. వివాదాలను పరస్పర చర్చలు, అంగీకారం, సామరస్యపూర్వక పరిష్కారాల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు వంటి పరిష్కరించదగిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని వివరించారు. ప్రజలు న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవడంతోపాటు, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించదగిన వివాదాల్లో ఈ విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, కోర్టు కేసుల భారాన్ని తగ్గించడం, వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్లు దశరథ రామిరెడ్డి, ఈశ్వరయ్యతోపాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఖైదీల సంక్షేమం, న్యాయ సహాయంపై ప్రత్యేక దృష్టి

## కడప కేంద్ర, మహిళా ప్రత్యేక కారాగారాలను తనిఖీ చేసిన బోర్డ్ ఆఫ్ విజిటర్స్ కమిటీ

## ఖైదీలకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచన

కడప, అక్టోబర్ 24 (మహి న్యూస్): బోర్డ్ ఆఫ్ విజిటర్స్ కమిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కడప కేంద్ర కారాగారం, మహిళా ప్రత్యేక





కారాగారాలను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కారాగారాల్లోని ఖైదీల గదులు, వంటశాలలు, ఆసుపత్రి, నిల్వ గదులు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఖైదీలు వివిధ వృత్తి నైపుణ్యాల ద్వారా తయారు చేస్తున్న వస్తువులను, వాటి తయారీ విధానాన్ని



పరిశీలించారు. ఈ కార్యక్రమాల నిర్వహణ, ఖైదీలకు అందిస్తున్న శిక్షణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

### ఖైదీల న్యాయపరమైన అంశాలపై సమీక్ష

ఖైదీల న్యాయపరమైన అంశాలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. వారి కేసులకు సంబంధించి హైకోర్టులో దాఖలైన అప్పీళ్లు, వాటి ప్రస్తుత స్థితిగతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. ఖైదీలకు న్యాయ సహాయం అందుతున్న తీరును, న్యాయపరమైన పరిష్కారాల కోసం తీసుకుంటున్న చర్యలను సమీక్షించింది. ఖైదీల హక్కుల పరిరక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్య సంరక్షణ, న్యాయ సహాయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సూచించింది. సంబంధిత నిబంధనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపింది.

### కారాగారాల్లో మొక్కలు నాటిన కమిటీ సభ్యులు

తనిఖీ కార్యక్రమంలో భాగంగా కారాగారాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్శన ద్వారా కారాగారాల్లోని సౌకర్యాలు, ఖైదీల సంక్షేమం, న్యాయపరమైన అంశాలపై కమిటీ సమగ్రంగా వివరాలు సేకరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, జిల్లా





కలెక్టర్ తరఫున డీఆర్వో కె. మల్లికార్జునుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి యుగంధర్, పంచాయతీరాజ్/ప్రజాపనుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. చెంగలరాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎస్. షంషుద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సి. లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. సుబ్రమణ్యేశు రావు, పురుషుల కేంద్ర కారాగారం, మహిళా ప్రత్యేక కారాగారాల సూపరింటెండెంట్లు, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

# ప్రియదర్శిని బాలవిహార్లో కాయిన్ ఎగ్జిబిషన్






మహిన్యూస్ కొత్తపేట (అక్టోబర్ 24): ప్రియదర్శిని బాలవిహార్ లో ఈరోజున స్టూడెంట్ కాయిన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. దాదాపు 20 మంది విద్యార్థినీ విద్యార్థులు తాము సేకరించిన కరెన్సీ నోట్లను నాణెములను ప్రదర్శించారు. కొందరు తాము ప్రదర్శించిన నాణేల బొమ్మలను కూడా చిత్రించి తెచ్చారు. కొందరు కేవలం నాణేలను, నోట్లను ప్రదర్శించడమే కాకుండా అవి ఏ కాలం నాటివో, ఏ దేశానివో, ఏ సందర్భంలో ముద్రించినవో, వాటి చారిత్రక నేపథ్యాన్ని సైతం వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం చలామణిలో ఉన్న నాణేలతో పాటు ఒకప్పటి పైసల నాణేలు, బ్రిటిష్ కాలం నాటి నాణేలు, అంతకంటే పూర్వపు రాజుల కాలంనాటి నాణేలు, విదేశాల నాణేలు, వివిధ కరెన్సీ నోట్లు ఈ ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. పిల్లలు మొబైల్స్ కి బానిసలు కాకుండా, ఎడిక్ట్ కాకుండా, గంటల తరబడి మొబైల్ చూస్తూ ఉండకుండా ఉండేందుకు, వారి దృష్టిని వేరే విద్యా విషయక అంశాల వైపు మరల్చేందుకు ప్రియదర్శిని బాలవిహార్ చేపట్టే అనేక మోటివేషన్ కార్యక్రమాలలో భాగంగా ఈ నాణేల, నోట్ల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టామని కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్రదేవ్ అన్నారు. ఒకప్పటి నాణేల వైభవం నెమ్మదిగా అంతరించి కరెన్సీ నోట్లు మనుగడలోకి వచ్చి వాటి అవసరం కూడా తగ్గి బ్యాంకు కార్డులు, డిజిటల్ మనీ అమలులోకి




వచ్చాయని, అంతకుమించి ప్రస్తుత కాలంలో మొబైల్ ట్రాన్సాక్షన్ ద్వారానే అన్ని రకాల లావాదేవీలు జరగడం మొదలైందనీ ఈ క్రమంలో నాణేలను గురించి, కరెన్సీ నోట్ల గురించి పిల్లల్లో తగినంత అవగాహన కల్పించడం కోసం తాము ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని అకాడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య అన్నారు. పూర్వం వస్తు మార్పిడి పద్ధతి (బార్టర్ సిస్టం) ఉండేదని కాలక్రమంలో దాని స్థానంలోకి రకరకాల రాళ్లు, గవ్వలు, తోలు ముక్కలు మారక ద్రవ్యంగా చలామణి లోకి వచ్చాయని ఆ క్రమంలోనే వాటి స్థానంలో క్రమంగా రాగి, ఇత్తడి, వెండి, బంగారం లాంటి లోహాలతో తయారుచేసిన నాణేలు కూడా కాలక్రమంలో మనుగడలోకి వచ్చాయని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఏఎస్ఆర్ మూర్తి పిల్లలకు వివరించారు. ఈ ప్రదర్శనలో పిల్లలు వివిధ నాణేలను నోట్లను రెండు వైపులా




పరిశీలించి అవి ఎలా ఉన్నాయో, వాటిపై ఏ చిత్రాలు ముద్రించి ఉన్నాయో, వాటిల్లో ఏ విధమైన విద్యాదాయక విషయాలు దాగి ఉన్నాయో, వాటిల్లో వివిధ కళాకృతులు ఏవిధంగా పొందుపరిచి ఉన్నాయో ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు వివరించారు.

# రాజకీయ ప్రకటనలపై ప్రత్యేక నిఘా పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ

మదనపల్లి, మహి న్యూస్, అక్టోబరు 24:- అన్నమయ్య జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు నిర్వహించనున్న రెండో సాధారణ ఎన్నికలు-2026 నేపథ్యంలో రాజకీయ ప్రకటనలపై పటిష్ట పర్యవేక్షణ చేపట్టేందుకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ ప్రకటనలు, వార్తా కథనాల రూపంలో ప్రచురితమయ్యే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌లను గుర్తించి పర్యవేక్షించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత అని వివరించారు. జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఛైర్మన్‌గా, జిల్లా కేంద్రం మున్సిపల్ కమిషనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ మరియు ఉపాధి కల్పన అధికారి, సమాచార బహు సంబంధాల శాఖ ఏపీఆర్ఓ సభ్యులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ తెలిపారు.

### వివిధ మాధ్యమాల్లో రాజకీయ ప్రకటనలపై నిఘా

జిల్లాలోని వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లోని ఆడియో-విజువల్ డిస్‌ప్లేలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ సందేశాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే రాజకీయ ప్రకటనలను కమిటీ నిరంతరం పరిశీలిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. వార్తా కథనాల ముసుగులో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలను గుర్తించి, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు.

### పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా ప్రచురితమయ్యే చెల్లింపు వార్తలను గుర్తించడంతో పాటు, అభ్యర్థుల తరఫున ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జరిగే రాజకీయ ప్రకటనలను కమిటీ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించి, అభ్యర్థులకు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులు వాస్తవంగా చేసిన ఎన్నికల ప్రచార వ్యయాలకు సంబంధించిన వివరాలను సమర్పించని సందర్భాల్లో, నిర్ధారించిన ప్రామాణిక రేట్ల ఆధారంగా ప్రకటనల వ్యయాన్ని అంచనా వేసి, నిబంధనల ప్రకారం సంబంధిత అభ్యర్థి ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని మీడియా సంస్థలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని, రాజకీయ ప్రకటనలు మరియు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాల్లో నిబంధనలను ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కౌంటింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలి

## ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలి

## ఆర్వోలు, ఏఆర్వోలకు పోలింగ్, ఓట్ల లెక్కింపుపై శిక్షణ

## బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన



కర్నూలు, అక్టోబర్ 24: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో విధులు నిర్వహించే సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు (ఏఆర్వోలు) పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలపై శిక్షణ నిర్వహించారు. జిల్లా ట్రైనింగ్ నోడల్ అధికారి, డ్వామా పీడీ ఐ. నరసింహ రెడ్డి, మేయర్ స్థాన రిటర్నింగ్ అధికారి, సెట్కూరు సీఈఓ డాక్టర్ కే. వేణుగోపాల్‌తో కలిసి చల్లా ఓబులేసు బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని, అభ్యర్థుల ఏజెంట్లు కూడా సకాలంలో హాజరయ్యేలా చూడాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సుల సీల్స్‌ను పరిశీలించిన తర్వాతే నిబంధనల ప్రకారం వాటిని తెరవాలని, బ్యాలెట్ పత్రాల సంఖ్యను సంబంధిత రికార్డులతో సరిపోల్చుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలను తొలుత కట్టలుగా విభజించి, అనంతరం అభ్యర్థుల వారీగా ఓట్లను వర్గీకరించి లెక్కించాలని వివరించారు. ప్రతి 25 బ్యాలెట్ పత్రాలతో ఒక కట్టను ఏర్పాటు చేసి, 1,000 బ్యాలెట్ పత్రాలను ఒక లెక్కింపు టేబుల్‌కు కేటాయించే విధానంపై అవగాహన కల్పించారు. చెల్లిన, చెల్లని ఓట్లను గుర్తించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సందేహాస్పద బ్యాలెట్ పత్రాలపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ప్రతి రౌండ్‌లో లెక్కించిన ఓట్ల వివరాలను సక్రమంగా నమోదు చేసి, సంబంధిత రికార్డులను జాగ్రత్తగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ఓట్ల లెక్కింపులో పారదర్శకత, కచ్చితత్వం పాటిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమన్వయంతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com